# అర్థంకాని హృదయం

రచన :
శ్రీ వై. వెంకటబలరాం.

["ఈ సంఘంలో ఎల్లప్పుడూ స్త్రీ పురుషునిచే మోసగింపబడుతుందంటారు. కాని చంచల హృదయంగల స్త్రీల ప్రవర్తన మూలంగా ఎంతమంది పురుషులో ఆహుతి అవుతున్నారన్న, నిగూఢ సత్యాన్ని ఈసంఘం ఎందుకు తెలుసుకోలేక పోతుందో?"]

★

సాయంకాలం అయిదు గంటలయింది.

అప్పుడే కాలేజీనుండి వచ్చి స్నానం చేశాను. పూజ చేసుకుందామని అలానే తుండు మొలకు చుట్టుకుని దేముని దగ్గర అగరవత్తులు వెలిగించబోతుండగ బయట తలుపు మీద ఎవరో 'టక్ - టక్' మని కొట్టడంతో ఆగిపోయాను.

"ఎవరా?" అనుకుంటూ తలుపు తీసి, ఎదురుగ కన్పించిన వ్యక్తిని చూచి ఆశ్చర్యపోయాను. ముందుగ అతనే పలుకరించాడు.

"ఏరా! ఆశ్చర్యముగా ఉందా మద్రాసులో ఉండవలసిన వాడు చెప్పా చేయకుండా ఇలా వచ్చేదేమిటా అని."

అవునురా బ్రదర్ ఒక ఉత్తరం ముక్కయినా వ్రాయకుండా ఇలా వస్తే ఆశ్చర్యం గాక మరేమిటి! ఇలా వచ్చి కూర్చో అంటూ ఒక కుర్చీ చూపించాను.

అవును, మనము కలుసుకొని చాన్నాళ్ళయిందికదురా! నేను మూడేండ్ల క్రిందట తిరుపతి వెళ్ళుతూ యుండగ గుడివాడలో కలుసుకొన్నాము. కొంచెమైనా మాటలాడావో లేదో మీ బాస్‌ను రిసీవ్ చేసుకోవాలి త్వరలోనే కాకినాడ వచ్చేస్తానులే అంటూ మాయమయ్యావు. మరల ఇప్పుడు దర్శనమిస్తున్నావు అన్నాను. పరమేశ్ చిన్నగా నవ్వి కుర్చీలో కూర్చుంటూ "ఇంట్లో అంతా కులాసాయే కదా!" అన్నాడు.

"ఆఁ, అంతా కులాసాయె." అంటూ వాడి ప్రక్క తేరిపార చూసి "నాకు ఉత్తరములు ఎలాగున వ్రాయడము మానివేశావు కానీ ఇంటికి కూడ వ్రాయడము లేదని విన్నాను. ఏమిటి సంగతి?" నేనడిగిన దానికి సమాధానమీయకుండ దిక్కులు చూస్తున్నాడు.

"అవును, బాబు మీరు పెద్ద యింజనీరులయ్యారుకదా ఇంక మేమెక్కడ గుర్తుంటాము?" అన్నాను.

చటుక్కున ముఖం దీనంగా పెట్టి "మరీ అంత నిష్ఠూరముగా మాట్లాడకురా, నేను చేసిన పనికి, ఉత్తరాలు వ్రాయడానికి ముఖం చెల్లక వ్రాయలేదుగాని అసలు దేవుళ్ళంటూ ఉంటే మీరే నా దేవుళ్ళు" అన్నాడు బాధగా.

నేనలా అన్నందుకు లోలోపల బాధపడి "ఏమి బ్రోయ్!, నీవు చేసిన పని నేను వినొచ్చా" అన్నాను కాస్త నవ్వుతూ.

"ఇప్పుడు కాదులే, తరువాత చెబుతాను. ముందు నీ పూజా పునస్కారాలు కాని."

అగరవత్తులు వెలిగించి పటానికి ఒక మూల గ్రుచ్చానో లేదో...... "ఒరేయ్, నీకింకా ఆ బుద్ధి పోలేదురా మెడికల్ కాలేజి హాస్టల్‌లో ఉంటూ దేముడు దయ్యమంటున్న నిన్ను, మిగతా స్టూడెంట్సు నీ ఆట పట్టించలేదా?"

"ఒరేయ్, నీకు పుణ్యముంటుంది ఈ వెధవ ప్రశ్నలన్ని తరువాత అడుగుదువుగాని ముందు మా మాగజైన్‌లో నేను వ్రాసిన "అమాయిక జీవి" కథ ప్రచురించారు, చదువుతూ వుండు" అంటూ పుస్తకము అందించాను.

"నేనిందులో నీవు వ్రాసిన కథే చదువుతాను," అంటూ విసుగ్గా మాగజైను అందుకున్నాడు.

మా యిద్దరి మధ్య కొన్ని నిముషములు మౌనంరాజ్యం చేసింది.

"ప్రభాకర్! పూజ పూర్తయ్యింది కదా, తర్వగా డ్రెస్సవ్ అవ్వు, బయటికి పోదాము." అన్నాడు పరమేశ్.

నేను ఫేంటు తొడుగు తుంటుండగా, నా మొహాల్ని, గడ్డము తదేకంగా తరచి తరచి చూస్తున్నాడు.

నేనే అడిగాను "అదేమిట్రా వింతగా అలా చూస్తున్నావు?"

"ఏమిలేదు. మొన్న గుడివాడ స్టేషనులో గడ్డము దగ్గర ఆ గీటు చూసి ఏమిట్రా అంటే, అదోలా నవ్వి "ఇప్పుడు కాదులే ఎప్పుడైనా నేను కాకినాడ వచ్చి నప్పుడు చెప్తానన్నావు." ఇప్పుడు నీ మొహాలుమీద కూడ అలాంటి గీటే వుంటే చూస్తున్నాను. ఏమయినా నువ్వు ఇవ్వాళ చెప్పాల్సిందే నేను ఈ సారి వట్టినే కాకినాడ రాలేదు. పర్మినెంట్ ట్రాన్స్ఫర్ మీద ఎ. ఇ. గా వచ్చేసాను తెలుసా!" అన్నాడు విజయ గర్వంగా. సంతోషమైన ఆ వార్త వినగానే కరచాలన చేసి హృదయానకి హత్తుకొన్నాడు.

"పదరా బ్రదర్ నీకదంతా తప్పక చెపుతాను" అంటూ ఇద్దరమూ బయటికి దారి తీసాము. ఇదరము కలసి ఒక హోటలుకివెళ్ళి మూలగా ఎవరూలేని టేబిలు దగ్గర కూర్చొని కాఫీకి అర్డరు ఇచ్చాము.


పరమేశ్ ముందుగా అన్నాడు "నీ కథ చాలా బాగుంది. కాని నీ కథలోలా ఏ స్త్రీ కూడా ఇద్దరు ముగ్గుర్ని ప్రేమించి నాలుగోవాడిని పెండ్లాడదంటాను."

వాడి మాటలు విని నేను నవ్వేను.

"చూడు పరమేశ్. నీ వన్నట్లు ఏ స్త్రీ కూడా అలా వుండక పోవచ్చు. కాలమాన పరిస్థితులనుబట్టి కొంతమంది మారుతుంటారు. కొంతమందికి అలా చేయుడమే ఒక సరదాగా, హాబీగా తీసుకొంటారు. నా కెందుకో అలాగా కథ వ్రాయాలనిపించి వ్రాసేను. అంతేగాని ఏ స్త్రీ అలా చేస్తుందని గాని చేయాలని వుద్దేశ్యముతోగాని వ్రాయ లేదు" అన్నాను. నా కింకా ఆ సంభాషణ పొడిగించాలని లేదు.

కాని పరమేశ్ ఇలాగన్నాడు. "నీ కథలో మురళీధర్ తన పెళ్ళికి ముందే తన భార్య అయిన మైత్రేయి, మరెవరినో ప్రేమించినదని తెలిస్తే ఎంత బాధపడతాడో గదా!"

ఈ మాటలు విన్న నేను, నా కథ పరమేశ్ ని బాగా



అకట్టు కొన్నాడని గ్రహించాను. "అందుకే ఈ విషయము మురళీధర్‌కు తెలియకుండానే, కథ సుఖాంతంగా ముగించాను. మైత్రేయి పెళ్ళిముందు తన తప్పుడు ప్రవర్తన వివాహ జీవితంలో పశ్చాత్తాప పడిందిగా" అని నవ్వుతూ అన్నాను. ఇంతలో సర్వరు రెండు కాఫీ కప్పులను తెచ్చి మా ముందుంచేడు. కాఫీ తీసుకుంటూ పరమేశ్ ముఖంలోకి చూశాను. ముభావముగా ఏదో ఆలోచిస్తున్నట్లుంది. అది నా కథ ప్రభావము కాబోలు అనుకున్నాను. కాఫీ కప్పు ఖాళీచేసి బల్లపై పెడుతూ, "మనము పార్కుకి వెళ్ళి చాలా రోజులయింది. ఇప్పుడలాగ పార్కుకి వెళ్ళదామా" అన్నాడు పరమేశ్. "అలాగే" అంటూ ఆఖరు గుటక వేసి కౌంటరులో బిల్లు చెల్లించాను. అక్కడ నుండి ఇద్దరం కలసి పార్కుకి బయలుదేరాము.

హోటల్ నుండి పార్కుకి మూడు ఫర్లాంగుల దూరముంటుంది. పరమేశ్ ఈ వూరు వచ్చినప్పుడల్లా సాయంత్ర మయ్యేసరికి అలా పార్కుకనో, బీచ్‌కనో, సినిమాకనో నడుచుకుంటూ బయలుదేరే వాళ్ళం. మేమెప్పుడలాగ బయలుదేరినా పరమేశ్ ఏదోక విషయం గురించి నేను విన్నా వినకపోయినా మాట్లాడము అలవాటు. అలాగే ఈ మధ్య మద్రాసులో వుండి వచ్చాడేమో, అక్కడి బీచ్ గురించి చెప్పడము మొదలు పెట్టాడు.

"ప్రభాకర్! మద్రాసులో మెరీనా బీచ్ చూసాక అటువంటిది నేను ఎక్కడ చూడనేమో ననిపించింది. అక్కడ బీచ్‌లో......అదే పనిగా మద్రాసు గురించి వాడికి తోచినదంతా చెప్పుకు పోతున్నాడు. వాడు చెప్పే ఏ ఒక్క మాట నా చెవుల కెక్కడము లేదు. నాకు ఇవాళ చాలా సంతోషముగా వుంది. పరమేశ్ అలా మాట్లాడతుంటే, నాకు వాడితో గల చిన్ననాటి నుండి కలసి మెలసిన కదలిక లెన్నో నా కళ్ళముందు నిలుస్తున్నాయి.

* * *

మేము మాది మొదట విశాఖపట్నం నివాసస్థలం. పరమేశ్ కుటుంబమంతా వాళ్ళ నాన్న అతనుమాత్రమే. మంచికి మారుపేరు పరమేశ్ తండ్రి వెంకటేశ్వరరావు గారు. పరమేశ్ పుట్టిన నాలుగు నెలలకే వాళ్ళమ్మ చనిపోయిందట. వాళ్ళకు రెండు గదులు ఇల్లు తప్ప వేరే ఆస్తి లేదు. వాళ్లు మా ఇంటి ప్రక్కయింటిలో వుండుట వలన వాళ్ళ తండ్రి మా ఇంటికి ఏవో అవసరాలకు వస్తూ పోతుండేవాడు. ఆయన వుద్యోగము చిన్నదగుటవలన రాబడి తక్కువగుట వలన ఏవో అవసరాలు వుండకుండ

"SELEKT"
MOTORS & PUMPS



FOR:—
EFFICIANCY· ECONOMY AND TROUBLEFREE SERVICE·



MOST POPULAR IN TELENGANA DISTRICTS·

—:*Manufactured by*:—

CHITRA INDUSTRIES
COIMBATORE 641005
Grams: 'SELECT PUMP' Phone 24548

—:సేల్స్ బ్రాంచ్:—

చిత్రా ఇండస్ట్రీస్
5-1-446, రాణిగంజ్
సికిందరాబాద్-3 (ఎ.పి.)
ఫోన్: 77826

వుండేవికావు. ఒక్కగా నొక్క కొడుకని రెక్కలు ముక్కలు చేసుకొనియైనా పెద్ద చదువులు చదివించాలని ఉండనే వారు మా నాన్నగారి దగ్గరకొచ్చినప్పుడల్లా. పరమేశ్ నేను ఒకే వయస్సువాళ్ళం. బడిలోకూడ ఒకే సారి చేరాము. తారతమ్యాల నెరుగని మా పసిహృదయాలొకటయినాయి. పరమేశ్ వాళ్ళ ఇంట్లో కన్నా మా ఇంటిలోనే ఎక్కువగా వుండేవాడు. ఇలా మా స్నేహము దినదినాభివృద్ధి చెందుతూ రోజులే కాదు పదకొండు సంవత్సరాలు గడిచిపోయాయి. మేము ఎస్.ఎస్.ఎల్.సి పరీక్ష వ్రాసేము. ఒకరోజు వెంకటేశ్వరరావుగారికి విపరీతముగా గుండెలలో నొప్పి వచ్చి కాలములో కలిసిపోయారు. ఆయన చనిపోవకముందు వాళ్ళకున్న రెండు గదుల ఇల్లు ఎవ్వరికి చెప్పకుండా అమ్మి ఆయన చేసిన తలకుమాలిన అప్పులన్నీ తీర్చేసేరు. పరమేశ్ కు నాది అని చెప్పుకునేందు కేమి మిగలలేదు. ఆ సమయంలో నాన్నగారు పరమేశ్ ను చేరదీశారు.

ఇంతలో మా ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షా ఫలితాలు వచ్చాయి. ఇద్దరము పాసయ్యేము. నా సంతోషానికి అవధులు లేవు. ఇద్దరము పై చదువులు చదవవచ్చునని. కాని ఆ రోజు పరమేశ్ ఎవ్వరు చూడకుండ ఏడ్చేడు. వాళ్ళ తండ్రి వుండివుంటే ఎంతో సంతోషించేవారని. తరువాత మాకు వచ్చిన మా మార్కులను చూసి ఇద్దరిని పై చదువులు చదివిస్తానన్నారు నాన్నగారు. కాని నేను అస్వస్థత గురి అగుట వలన (డాక్టర్ సలహాపై) రెండు సంవత్సరముల వరకు కాలేజికి వెళ్ళలేకపోయాను. పరమేశ్ పి. యు. సి. లో ఎమ్. పి. సి. గ్రూపుతో ఫస్టు క్లాసులో పాసయినందువల్ల వైజాగ్ లోనే ఇంజనీరింగు కాలేజిలో స్కాలర్ షిప్ మీద సీటువచ్చి జాయిన్ అయ్యేడు. వాడు రెండవసంత్సరం చదువుతూ యుండగా నేను పి. యు. సి. లో జాయిన్ అయ్యేను. నేనెలాగయిన డాక్టరు నవ్వాలన్న ఆశతో పట్టుదలతో చదివాను. ఫస్ట్ క్లాసులో ప్యాసయ్యేనుగాని గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో సీటు తెచ్చుకోలేకపోయాను. నాన్నగారు నా పట్టుదలను చూసి, కాకినాడ మెడికల్ కాలేజిలో జాయిన్ చేసేరు. నేను విశాఖ వదలి కాకినాడ వెళ్లుతున్నప్పుడు మా ఎడబాటుకు పరమేశ్, నేను పడిన బాధ వర్ణనాతీతం.

నేను మూడవ సంవత్సరం చదువుతుండగా ఫరమేశ్ 'బి. ఎ. ఫైనల్ ఇయిర్ మెరిట్ తో పాసయ్యేడు. వాడి అదృష్టము కొలది వున్న ఊరిలోనే వుద్యోగము సంపా

Grams "SHIVAJITEX" Phone 23516




T. MARIMUTHU
HANDLOOM WEAVING FACTORY
SELLUR: MADURAI-625002

టి. మారిముత్తు.
హేండ్ లూమ్ వీవింగ్ ఫ్యాక్టరి,
సెల్లూర్ : : మధురై-625002

దించేదు. ఉద్యోగము ప్రవేశించేనని చెప్పేందుకు పరమేశ్ కాకినాడ వచ్చాడు. అతనిలో కొంత మార్పు గమనించేను. మనిషి పొడువుకు తగ్గ లావయ్యాడు. ముఖంలో చక్కని కళ వుంది. విశాలమయిన ఫాల భాగం, తీర్చిదిద్దిన ముక్కు మరింత అందాన్ని చేకూర్చింది. అన్నిటికన్నా ఉంగరములు తిరిగిన జుట్టు మరింత బాగుంది. నిజం చెప్పాలంటే వయసులో నున్న ఆడది వాడి ఆకర్షణనుండి తప్పుకోవడము కష్టమనే చెప్పాలి. అదేమాట వాడితో అంటే నీ విశాల నేత్రాల ముందు నా అందమెంత. నీ కళ్ళనుండి ఏ అమ్మాయి మటుకు తప్పించుకో గలదనేవాడు. ఒక్క విషయములోమటుకు ఇద్దరికి పడేదికాదు. నేను దేముడున్నాడని నమ్ముతాను. పరమేశ్ మాత్రం కృషిని నమ్ముతాడు. దేముడనేవాడెవ్వడు లేడనే నా స్తికుడు. కొద్ది నెలలకే పరమేశ్‌ను అర్జంట్ ట్రాన్స్‌ఫర్ మీద మద్రాసు బదలీ చేశారు. వాడు మద్రాసు వెళ్ళిపోతూ త్వరగా వెళ్ళవలసి వచ్చినందుకు నీ దగ్గరకు రాలేకపోతున్నందుకు క్షమించు. ఇక్కడవుంటే వారానికి కనీసం ఒకసారి అయినా వచ్చి నిన్ను చూస్తున్నానని సంతోషపడే వాడిని కాని ఇకమీదట ఆ భాగ్యానికి నోచుకోలేదు. మీ అందరిని వదలి వెళ్ళుతున్నానన్న బాధ ఎప్పటికి తీరగదని ఒక ఉత్తరం వ్రాసాడు. ఆ ఉత్తరము చదువుతుండగానే నా కళ్ళనుండి కన్నీళ్ళు కారాయన్న సంగతి ఉత్తరము చదివాక గాని తెలియలేదు. తరువాత రెండు సంవత్సరములు మా మధ్య ఉత్తరములు తరుచుగా సాగేవి. నేను ఫైనల్ ఇయిర్‌కి వచ్చిన తరువాత మే మిద్దరం ఉత్తరములమీద అంత శ్రద్ధ చూపలేకపోయాము. ఇంటికి మటుకు అందరిని అడుగుతూ ఉత్తరములు వ్రాస్తూ యుండేవాడు.

చెవి దగ్గర గొణుకుతున్నటనిపించింది. మద్రాస్‌లో గుడిసెలు ఉండడానికి వీలులేకుండా పూర్ పీపుల్ కాలనీ ఒకటి చక్కగా కట్టారు. అంటూ పరమేశ్ నా ప్రక్క తిరిగి వింటున్నావా? అన్నాడు. నాకు నవ్వు వచ్చింది, ఇంతవరకు నా చెవి ప్రక్కన గొణుగుతున్నాడని. ఇంతలో పార్కు వచ్చింది. నాకు మూడు ఫర్లాంగులు నడిచినట్టు లేదు. నా ఆలోచనలో అంతగా లీనమయిపోయానని వేరే చెప్ప నవసరం లేదు. పార్కు దగ్గర కొచ్చాక ఐస్‌క్రీమ్ బండివాడి దగ్గర కెళ్ళి రెండు కప్పుల ఐస్‌క్రీమ్ తీసుకొచ్చాడు పరమేశ్. నేను ఒక కప్పు ఐస్‌క్రీమ్ తీసుకొని పార్కులోకి దారి తీశాము.

"ఊరికొందుకో ఎక్కువమంది మనుష్యులు లేనట్టుంది కదూ!" ఐస్‌క్రీమ్ తీసుకుంటూ అన్నాడు పరమేశ్.

"ఈరోజే కాదు ఈ మధ్య జనం పలచబడ్డారు పార్కుకి ఎక్కువమంది రావడము లేదు." పార్కులో ఐదుగురో ఆరుగురో పిల్లలు జారుడుబల్ల ఎక్కి ఆడుకుంటున్నారు. మరో ఇద్దరు చిన్నపిల్లలు ఇసుక తీసి ఒకళ్ళ బట్టలమీద ఒకళ్లు పోసుకుంటున్నారు. చీకటిపడినట్లు సూచనగా పార్కులో దీపాలన్నీ ఒక్కసారిగా వెలిగాయి.

మేము మరి కొంచెముదూరము నడిచేము. పార్కులో ఒక ప్రక్కగ చిన్న గ్రంథాలయమున్నది. అందులోని వారంత చాలా నిశ్శబ్దంగా చదువుకుంటున్నట్లుంది. అక్కడక్కడ నలుగురో, ఐదుగురో మనుష్యులు తప్పించి ఎవ్వరూ లేరు. మా మౌనాన్ని భంగపరుస్తూ అలాపోయి "ఆ మూలనున్న సిమ్మెంటు బల్లపై కూర్చుని మాట్లాడుకుందాము పద" అన్నాడు. నేను మౌనంగా పరమేశ్‌ను అనుసరించాను. అక్కడ అంతగా వెలుగులేదు.

చక్కని అల్లిక - చిరకాల మన్నిక.




వీనస్ నిట్టింగ్ కంపెనీ,
తిరుపూరు 638604

బల్లపై కూర్చుంటూ "అవును. ఇంటికి ఉత్తరము లీ మధ్య వ్రాయలేదంటే క్షమించరాని తప్పు చేసా వన్నావు..అదేమిటో తెలుసుకోవచ్చా!" అన్నాను.

అంతవరకు బాగానే యున్నవాడల్లా ముఖం చిన్నది చేసుకొని నా రెండు చేతులు తన చేతుల్లోనికి తీసుకున్నాడు. వాడి కళ్ళల్లో రెండు నీటిబిందువులు నిలవడం నేను గమనించకపోలేదు. "నీతోగాక మరెవరితో చెబుతాను. కాని నేను చెప్పిన తరువాత నన్ను మీరు క్షమించగలరా?" అన్నాడు. నేను కాస్త అయోమయ పరిస్థితిలో పడ్డాను వీడి ధోరణి చూసి.

"పరవాలేదు చెప్పు. ఎవరూ క్షమించరాని తప్పు నీ వెప్పుడు చేయవన్న సంగతి నాకు తెలుసు. అయినా నా దగ్గర నీకు దిగులెందుకో నా కర్థంకావడంలేదు. నీవు చెప్పకూడదనుకుంటే ఒద్దులే. నేనేమీ అనుకోను" అన్నాను.

"నేను... నేను..."

"నువ్వు...ఏమయింది? త్వరగా చెప్పు."

"నేను పెళ్ళి చేసుకున్నాను."

నేను షాక్ తిన్నట్లుగా ఫీలయ్యాను. మళ్ళా అతనే చెప్పడం మొదలుపెట్టాడు.

"ఆశ్చర్యపోతున్నావు కదూ! దయచేసి నేను చెప్పిందంతా విని నీ అభిప్రాయం చెప్పు."

"ఏమిటి?" అన్నాను అతని ముఖం వంక పరీక్షగా చూస్తూ.

"నేను హైదరాబాద్‌లో వున్నప్పుడు విచిత్రంగా ఒక అమ్మాయితో పరిచయం అయింది. పరిచయం క్రమేణా ప్రణయంగా మారింది. కొంత కాలానికి ఒకరి నొకరం విడిచి ఉండలేని పరిస్థితికి వచ్చాము. మొదట వాళ్ళింట్లో తెలిస్తే ఒప్పుకోరని మేము రిజిస్టరు మారేజి చేసుకున్నాము–" చెప్తున్నాడల్లా ఆగి నా వంక చూసాడు. నేను అలాగే వినసాగేను.

"ముందర ఈ విషయాన్ని అమ్మతో, నాన్నతో (మీ అందరితో) మాట్లాడి పెళ్ళి చేసుకుందామనుకున్నాను. ఇప్పుడు వాళ్ళకి ఏ ముఖం పెట్టుకొని కనపడగలను. నన్ను క్షమించగలరా?" అన్నాడు తల వంచుకుంటూ.

"ఒరేయ్ పరమేశ్ .."

తలెత్తి నా వంక చూడసాగేడు నేనేమి చెప్తానో అని నేను నవ్వేస్తూ "భలే వాడివే. యిదా విషయం నువ్వు యీ మధ్య యింటికి జాబులు రాయకపోవడానికి కారణం? యీ విషయం వింటే అమ్మా నాన్నా ఎంత సంతోషిస్తారో తెలుసా? యింతకీ నువ్వు వరించిన ఆ సుందరెవరు? పేరు తెలుసుకోవచ్చా?"

ఇప్పుడు పరమేశ్ ముఖం వికసించి ముఖంలో సంతోషం స్పష్టంగా కనిపించింది.

"మీరు నేను చేసిన పనికి క్షమించలేమో అనుకున్నాను. ఆ అమ్మాయి కూడా మెడిసన్ చదువుతుంది. ఆ అమ్మాయిని గురించి చెప్పడం కన్నా, యిద్దరం కలిసి త్వరలో యింటికి వస్తాములే" అన్నాడు.

ఇంకా అమ్మాయిని గురించి అడగబోయి నెమ్మదిగా తర్వాత అడగవచ్చునులే అనుకుంటూ.

"అయితే పరమేశ్...చాలా అదృష్టవంతుడువోయ్. డాక్టరుగార్ని కట్టావన్నమాట. అవును యిందాక యీ గడ్డంమీది గీటు సంగతి అడిగావు కదూ? చెప్పనా? అన్నాను.

"చెప్పు" అన్నాడు తీరికగా వెనక్కి జారబడుతూ.

(సశేషం)

Tel: "FRACTIONAL" Phone: 24909

★ SIMPLE CONSTRUCTION
★ RELIABLE OPERATION
★ SILENT RUNNING

S K M-Single Phase Motors.

S K P_Self Priming CentripEtal pumps

SKM/S K P Unit Electric Pump Sets

EACH UNIT IS THOROUGHLY TESTED BEFORE DESPATCH

FOR DETAILS

PLEASE CONTACT MANUFACTURERS:

SREE KRISHNA FOUNDRY

PAPANAIKENPALAYAM

COIMBATORE - 641037.